GSTIN-NO:36FKPSI308PIZX

epaper:tmedia.net.in

# టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్ : గురువారం 25-01-2024 పేజీలు : 3

### భారత్ , ఇంగ్లాండ్ టెస్ట్ మ్యాచ్‌కు

## 60 ప్రత్యేక బస్సులు



**టీ మీడియా, జనవరి 24, హైదరాబాద్:** క్రికెట్ అభిమానులకు టీఎస్ఆర్టీసీ గుడ్‌న్యూస్ చెప్పింది. ఉప్పల్ క్రికెట్ స్టేడియంలో గురువారం నుంచి ఐదు రోజుల పాటు జరిగే ఇండియా , ఇంగ్లాండ్ తొలి టెస్ట్ మ్యాచ్ సందర్భంగా ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాల నుంచి ఉప్పల్ మైదానానికి 60 బస్సులను నడపనున్నట్లు టీఎస్ఆర్టీసీ ఎండీ సజ్జనార్ వెల్లడించారు. ఈ బస్సులు రోజూ ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమై.. తిరిగి రాత్రి 7 గంటల వరకు స్టేడియం నుంచి బయలుదేరుతాయని తెలిపారు. మ్యాచ్ వీక్షించాలనుకొనే క్రికెట్ అభిమానులు ఈ ప్రత్యేక బస్సుల సర్వీసులను వినియోగించుకోవాలని కోరారు.

### టార్గెట్ బీఆర్ఎస్...

# కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్

### ముఖ్యమంత్రితో భేటీకావడంపై రచ్చ



**టీ మీడియా, జనవరి 24, హైదరాబాద్:** తెలంగాణలో మరోసారి ఆపరేషన్ ఆకర్ష్‌కు.. తెరలేచినట్లు కనిపిస్తోంది. తాజాగా, ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు చెందిన నలుగురు బీఆర్ఎస్ నలుగురు ఎమ్మెల్యేలు.. సీఎం రేవంత్‌ను కలవడం రాజకీయంగా కలకలం సృష్టిస్తోంది. ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, నర్సాపూర్ ఎమ్మెల్యే సునితాలక్ష్మారెడ్డి, పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ఒకేసారి ముఖ్యమంత్రితో భేటీకావడం చర్చనీయాంశమైంది.పార్టీ మారుతున్నారన్న ప్రచారం ఊపందుకోవడంతో క్లారిటీ ఇచ్చారు ఆ నలుగురు ఎమ్మెల్యేలు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న ప్రొటోకాల్ ఉల్లంఘనలు, నియోజకవర్గ అభివృద్ధి విషయాలు చర్చించేందుకే సీఎం కలిసినట్టు చెప్పుకొచ్చారు.తమపై తప్పుడు ప్రచారం చేస్తే చట్టపరమైన చర్యలూ తీసుకుంటామని హెచ్చరించారు.బీఆర్ఎస్ చీలిపోతోందంటూ కొన్నాళ్లుగా కాంగ్రెస్ నేతలు చేస్తున్న కామెంట్స్ ఇప్పటికే హాట్ టాపిక్ అవుతున్నాయి. దీంతో, తాజాగా బీఆర్ఎస్‌కు చెందిన నలుగురు ఎమ్మెల్యేలు రేవంత్‌ను కలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఎవరొచ్చినా కలుపుకెళ్తామనీ.. సీఎంను ఎవరైనా కలవొచ్చనీ మంత్రులు చేస్తున్న వ్యాఖ్యలు కూడా రాజకీయవర్గాల్లో చర్చనీయాంశమవుతున్నాయి.సీఎంతో భేటీపై ఆ ఎమ్మెల్యేలు ఎంత క్లారిటీ ఇచ్చినా.. ఏదో చిన్న లాజిక్ మిస్సవుతోందన్నవారూ లేకపోలేదు. అభివృద్ధి కోసమే అయితే.. వీళ్లు తమ ప్రభుత్వంలో సీఎంను ఎన్నిసార్లు కలిశారు? అనే ప్రశ్నా ఉత్పన్నమవుతోంది. అంతేకాదు, సీఎంను కలిసేందుకు వెళ్తే.. పార్టీలో చర్చించొచ్చు కదా? అనేవాళ్లూ ఉన్నారు. ఈమాత్రం చిన్న విషయానికి కూడా చెప్పెళ్లాలి, చెప్పులేసుకెళ్లాలి అంటే ఎలా? అనేవారూ లేకపోలేదు. అయితే, ఏది కరెక్టో, ఏ తప్పో ఇప్పటికిప్పుడు అంచనా వేసే కన్నా కొన్నాళ్లాగితే పూర్తి స్పష్టత వస్తుందనేది ఇంకొందరి అభిప్రాయంగా ఉంది.

### కాంగ్రెస్ మా సోదరిని

# ప్రయోగించింది

### -దేవుడే గుణపాఠం చెబుతాడు



**టీ మీడియా, జనవరి 24,తిరుపతి:** కాంగ్రెస్ చెత్త రాజకీయం చేస్తోందని ఏపీ సీఎం జగన్ విమర్శించారు. కుటుంబాన్ని చీల్చి రాజకీయం చేస్తోందని ఫైర్ అయ్యారు. తిరుపతిలో ఇండియా టుడే ఎడ్యుకేషన్ సమ్మిట్‌లో పాల్గొన్న సీఎం జగన్.. ఈ కామెంట్స్ చేశారు. గతంలో తన బాబాయ్‌ను మంత్రిని చేసి కాంగ్రెస్ తమపై ప్రయోగించిందని చెప్పారు. చరిత్ర నుంచి పాఠాలు నేర్చుకోని కాంగ్రెస్ మరోసారి సోదరని తన పైకి ప్రయోగించిందని పేర్కొన్నారు. దేవుడు వారికి గుణపాఠం చెబుతారన్నారు జగన్. ప్రజా వ్యతిరేకత ఉన్నందునే కొందరికి టికెట్లు ఇవ్వలేదని స్పష్టం చేశారు. టీడీపీ, జనసేన కూటమితోనే తమకి పోటీ అన్నారు. ప్రజలు తమవైపే ఉన్నట్లు భావిస్తున్నామన్నారు జగన్. చంద్రబాబు విషయంలో ప్రతీకారం అన్నది లేనే లేదని.. సీఐడీ దుర్వినియోగ ఆరోపణలు అర్థరహితమన్నారు. ఏపీ అభివృద్ధి కోసమే కేంద్రంతో సఖ్యతగా ఉన్నట్లు స్పష్టం చేశారు.ఇక ఏపీలో విద్యా సంస్కరణలపై సీఎం జగన్ కీలక కామెంట్స్ చేశారు. పేదరికం తొలగించేందుకు చదువుపై పెట్టుబడి పెట్టడం మినహా మరో మార్గం లేదన్నది తన బలమైన నమ్మకమన్నారు. నాణ్యమైన విద్య అందుకోవడం ప్రతీ ఒక్కరి హక్కు కావాలని చెప్పారు. గతంలో పేదలకు తెలుగు మీడియంలో బోధన జరిగేది, ధనిక పిల్లలు ఇంగ్లీషులో చదివేవారని.. ఆ పరిస్థితి తాము పూర్తిగా మార్చివేసి.. పేదలకు సైతం ఆంగ్ల విద్యను చేరువ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం బోధించేలా చేయరాదని విమర్శించే వాళ్ల పిల్లలు ఏ మీడియంలో చదువుతున్నారు? అని సీఎం ప్రశ్నించారు. పిల్లలకు ఈజీగా అర్థమయ్యేలా.. పాఠ్యపుస్తకాల్లో ఒక పేజీలో తెలుగు, మరో పేజీలో ఇంగ్లీష్ పెట్టినట్లు తెలిపారు. నాడు-నేడు తీసుకొచ్చి పాఠశాలలో మౌలిక సదుపాయాలు మెరుగుపరిచామన్నారు. 62వేల తరగతి గదులుంటే .. 40 వేల తరగతి గదుల్లో ఇంటరాక్టివ్ టీవీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 8వ తరగతి విద్యార్థులందరికీ ఒక ఆధునికమైన టాబ్ నేర్చుకునేందుకు అందించినట్లు సీఎం తెలిపారు. బోధనకు అదనంగా అంతర్జాతీయ ఖ్యాతి గడించిన బైజూస్ అంశాలను చేర్చినట్లు వివరించారు. ఐదేళ్ల తర్వాత ఏపీ విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో బ్యాక్యులరేట్ సర్టిఫికెట్ కోసం పోటీ పడతారన్నారు జగన్. , ఏపీ రాష్ట్ర ప్రభుత్వం కలిసి పని చేస్తున్నట్లు తెలిపారు. ఏటా ఒక్కో తరగతి పెంచుకుంటూ.. చిన్న నుంచి పెద్ద తరగతుల వారికి . బోధన ఇస్తున్నామన్నారు.

### కాంగ్రెస్, బీజేపీ

# రెండూ ఒక్కటే..


- లోక్‌సభ ఎన్నికల్లోనూ కలిసి పనిచేస్తాయి
- మాజీ మంత్రి కేటీఆర్



**టీ మీడియా, జనవరి 24,కరీంనగర్:** కాంగ్రెస్‌కి 100 రోజులే డెడ్‌లైన్.. హామీలు అమలుచేయకపోతే వదిలిపెట్టే ప్రసక్తే లేదని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. కరీంనగర్‌లో కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. కాంగ్రెస్‌పై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అదానీతో కాంగ్రెస్ సర్కారు ఒప్పందంతో పాటు బీజేపీ ఎంపీల తీరుపైనా విమర్శలు గుప్పించారు. భవిష్యత్తులో రేవంత్ రెడ్డి ఏక్‌నాథ్ షిండే అయ్యే అవకాశముందని కేటీఆర్ అన్నారు. రేవంత్ రెడ్డికి ఏబీవీపీ, ఆర్ఎస్ఎష్ మూలాలు ఉన్నాయని గుర్తుచేశారు. ఆయన ఏమైనా చేస్తారని వ్యాఖ్యానించారు. బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటేనన్న కేటీఆర్.. పార్లమెంట్ ఎన్నికల్లో కూడా కరీంనగర్‌లో బీజేపీ, కాంగ్రెస్ కలిసి పని చేస్తున్నాయన్నారు. ఇంకా ఆయన ఏమన్నారో ఇక్కడ వీడియోలో చూడండి..గత లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ నుంచి నలుగురు బీజేపీ ఎంపీలు గెలిచారని.. వారు రాష్ట్రానికి చేసిన మేలు ఏంటో చెప్పాలని కేటీఆర్ ప్రశ్నించారు. బీజేపీ వచ్చిన తర్వాతే మనం బొట్టు పెట్టడం నేర్చుకున్నామా..? గుడిలో కి వెళ్లడం వాళ్లు మనకు నేర్పరా? మనం హిందువులం కదా..? అని ప్రశ్నించారు. బీజేపీ వాళ్లు దేవుడి తో రాజకీయం చేస్తున్నారని ధ్వజమెత్తారు. కరీంనగర్‌లో ఎంపీ బండి సంజయ్ ఏమి అభివృద్ధి చేసారో చెప్పాలన్నారు. ఈ విషయంలో బండి సంజయ్‌తో తాము బహిరంగ చర్చకు సిద్ధమన్నారు. వినోద్ కుమార్ ఎక్కడికి రమ్మంటే అక్కడికి బహిరంగ చర్చకు వస్తారని ఛాలెంజ్ చేశారు.

## ఉప్పల్‌లో భారత్, ఇంగ్లండ్ టెస్ట్ మ్యాచ్..

### -ట్రాఫిక్ ఆంక్షలు, మళ్లింపులు



**టీ మీడియా, జనవరి 24,హైదరాబాద్ :** గురువారం (జనవరి 25) నుంచి హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియం వేదికగా భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య మొదటి టెస్ట్ మ్యాచ్ జరగనుంది. గురువారం ఉదయం 9.30 గంటలకు ప్రారంభమయ్యే ఈనెల 29 వరకు అంటే మొత్తం ఐదు రోజుల పాటు జరగనుంది. మ్యాచ్ కోసం ఇరు జట్లు ఇప్పటికే హైదరాబాద్ నగరానికి చేరుకున్నాయి. ప్రాక్టీస్ కూడా షురూ చేశాయి. సుమారు ఆరేళ్ల తర్వాత ఉప్పల్ స్టేడియంలో టెస్ట్ క్రికెట్ మ్యాచ్ జరగనుంది. ఈ సందర్భంగా నగరవాసులతో పాటు క్రికెట్ అభిమానులు భారీగా తరలివచ్చే అవకాశం ఉంది. దీంతో స్టేడియంలోకి క్రికెట్ ప్రేక్షకులను ఉదయం 6.30 నిమిషాలకే అనుమతించనున్నారు. గ్రౌండ్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. స్టేడియం చుట్టూ 360 సీసీ కెమెరాలతో నిఘాను ఏర్పాటు చేశారు. ఇదిలా ఉంటే ఈ మ్యాచ్ కొనసాగే ఐదు రోజుల పాటు ఉప్పల్ పరిధిలో ట్రాఫిక్ ఆంక్షలు, మళ్లింపు ఉంటుందని పోలీస్ కమిషనర్ తెలిపారు.వాహనాల పార్కింగ్ స్థలాలు, సాధారణ ట్రాఫిక్‌తో పాటు ముఖ్యమైన కూడళ్లు, ప్రధాన రహదారులు, ఉప్పల్ మైదానం వైపు వచ్చే మార్గాలను దారి మళ్లిస్తున్నారు. కార్లు, బైక్స్, ఇతర వాహనాల పార్కింగ్ కోసం మొత్తం 15 స్థలాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. వీటి గురించి తెలుసుకునేందుకు రహదారులపై మాస్టర్ డైరెక్షనల్ బోర్డులు, లోకేషన్ మ్యాప్ లను సైతం ఏర్పాటు చేశారు. ఉప్పల్ స్టేడియం వైపు వెళ్లే మార్గాల్లోనూ మాస్టర్ డైరెక్షన్ బోర్డులను ఏర్పాటు చేశారు. ఉప్పల్ ఎక్స్ జంక్షన్ రోడ్డు, స్ట్రీట్ నెం.8 జంక్షన్, హబ్సిగూడ జంక్షన్, ఏక్ మినార్ మసీదు, తదితర ప్రాంతాల్లోనూ పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేశారు. ఇక ఉప్పల్ పరిసరాల్లో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు250 మంది ట్రాఫిక్ సిబ్బందిని నియమించారు. నగరవాసులు ట్రాఫిక్ ఆంక్షలు, మళ్లింపులను గమనించి సహకరించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.


## బిజెపితో టిడిపి, వైసిపి కుమ్మక్కు

### - ఏపీసిసి చీఫ్ వైఎస్ షర్మిలా




**టీ మీడియా, జనవరి 24, విశాఖపట్నం :** బిజెపితో టిడిపి, వైసిపి కుమ్మక్కయ్యాయని ఏపీసిసి చీఫ్ వైఎస్ షర్మిలా విమర్శించారు. విశాఖపట్నం జిల్లా కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా షర్మిలా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంలో కుమ్మక్కు రాజకీయాలు నడుస్తున్నాయని ఆమె పేర్కొన్నారు. బిజెపితో చంద్రబాబు కనిపించే పొత్తులు, వైసీపీ కనిపించని పొత్తులు పెట్టుకుంటున్నారని విమర్శించారు. ప్రత్యేక హోదాపై జగన్ ఎంపీలు ఇస్తే తెస్తా అన్నారని, అధికారంలో వచ్చిన వెంటనే మరిచిపోయారని అన్నారు. హోదా కోసం ఒక్కరోజు కూడా జగన్ ఉద్యమం చేసింది లేదని ఆగ్రహించారు. ఉత్తరాంధ్రను రెండు పార్టీలు మోసం చేశాయని తెలిపారు. ఇక్కడ ఉన్న కంపెనీలను ప్రైవేట్ కి అప్పనంగా అప్పగిస్తున్నారని మండిపడ్డారు. 30 ఏళ్ల లీజు తర్వాత గంగవరం పోర్ట్ ప్రభుత్వ పరం కావాల్సి ఉందని, కానీ దానిని చౌకగా అదానికి అమ్మేశారని ధ్వజమెత్తారు. నిబంధనలను తుంగలో తొక్కి ప్రభుత్వ వాటా 10 శాతంను చౌకగా అమ్మేశారని విమర్శించారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ చేయడం ఒక కుట్ర అని తెలిపారు. ఇందిరమ్మ హయాంలో ఏర్పడిన విశాఖ స్టీల్ ను అమ్మే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. వైఎస్సార్ హయాంలో 3 మిలియన్ టన్నుల ఉత్పత్తిని 7 మిలియన్ టన్నుల ఉత్పత్తికి పెంచారని, ఇప్పుడు నష్టాల సాకు చూపి ప్రైవేటీకరణ చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. 30 వేల మంది కార్మికులను రోడ్డున పడేస్తున్నారని ఆగ్రహించారు. విశాఖకి రైల్వే జోన్ ఇచ్చినా ఇంకా అమలు కాలేదని తెలిపారు. మెట్రో రైల్ ప్రాజెక్టు పత్తాకి లేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో, కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో రావాలని బీజేపీ తొత్తులుగా ఉన్న వైసిపి, టిడిపిలను ఓడించాలని కోరారు. బిజెపితో ప్రధాన పార్టీలు దోస్తీ అంశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్తామని తెలిపారు.

## సెక్యూరిటీ సిబ్బందిని మార్చేసిన ఇంటెలిజెన్స్ విభాగం



**టీ మీడియా, జనవరి 24, హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాధ్యతలు తీసుకున్న తరువాత తొలిసారిగా ఆయన భద్రతకు సంబంధించిన విషయంలో ఇంటెలిజెన్స్ విభాగం పలు మార్పులు చేసింది. ఇంటెలిజెన్స్ చీఫ్ శివధర్ రెడ్డి నేతృత్వంలో రేవంత్ భద్రతపై సమీక్షించిన తరువాత కీలక నిర్ణయం తీసుకున్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వద్ద పనిచేసిన ఇంటెలిజెన్స్ వింగ్ కు సంబంధించిన అధికారులు ఇప్పటికీ రేవంత్ రెడ్డి వద్ద కొనసాగుతున్నారు. వీరందరిని తొలగించాలని ఇంటెలిజెన్స్ చీఫ్ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఆదేశాలుసైతం జారీ అయ్యాయి.సీఎం దగ్గర పనిచేసే అధికారుల నుంచి ఎలాంటి సమాచారంకూడా బయటకు పొక్కకుండా ఉండాలి. సీఎం రక్షణ బాధ్యతలుకూడా అత్యంత కీలకమైన అంశం కావటంతో ఇంటలిజెన్స్ విభాగం అప్రమత్తమైంది. రేవంత్ కోటరీ నుంచి ఎలాంటి సమాచారం బయటకు పొక్కకుండా ఉండేందుకు ఐఎస్ డబ్ల్యూ అధికారులను మార్పులు చేసింది. వీరిలో కొందరు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వద్ద తొమ్మిదేళ్లుగా పనిచేసిన వారు ఉన్నారు. ఈ క్రమంలో ప్రస్తుత సీఎం రేవంత్ వద్ద వారిని ఇంకా కొనసాగించడం సరికాదని భావించిన ఇంటెలిజెన్స్ విభాగం వారిని సీఎం భద్రత విభాగం నుంచి తొలగించాలని నిర్ణయించింది.

# 26న రైతుల ట్రాక్టర్, బైక్ ర్యాలీ



**టీ మీడియా, జనవరి 24, మహానంది:** జనవరి 26వ తేదీన నంద్యాలలోని నూనె పల్లె ఓవర్ బ్రిడ్జి నుండి పద్మావతి నగర్ వరకు జరుగు ట్రాక్టర్, బైక్ ర్యాలీలో రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి .రామచంద్రుడు కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం, ఢిల్లీ రైతు ఉద్యమం సందర్భంగా రైతాంగానికి ఇచ్చినటువంటి హామీలను మోడీ అమలు చేయడంలో విఫలం అయ్యారని,రైతాంగం వాడే అన్ని రకాల విత్తనాలు ,ఎరువులు ,మందుల రేట్లు విపరీతంగా పెంచిన ప్రభుత్వం స్వామినాథన్ కమిషన్ సూచించిన విధంగా %ఽ%2 ప్లస్ 50 ఫార్ములా ప్రకారం మద్దతు ధరలు నిర్ణయించి చట్టబద్ధత కల్పించాలని, రైతాంగం కోరితే హామీ ఇచ్చి మాట తప్పిందన్నారు. అలాగే ఆదాని అంబానీలకు మేలు జరిగే విధంగా కార్పొరేట్ కంపెనీల కు పంట ఇన్సూరెన్స్ అప్పగిస్తున్నదని, కానీ రైతులకు మేలు చేకూరే విధంగా సమగ్రమైన పంటల బీమా అమలు చేయడం లేదన్నారు. పెరుగుతున్న రైతాంగం ఆత్మహత్యలను దృష్టిలో పెట్టుకొని, ఒక్కసారైనా రైతుల పంట రుణాలన్నింటిని మాఫీ చేయమని రైతు సంఘాలు కోరుతున్న ఏమాత్రం పలకడం లేదన్నారు. దేశవ్యాప్తంగా వ్యవసాయ కూలీలు పోరాడి సాధించుకున్న జాతీయ ఉపాధి హామీ పథకంలో పని దినాల సంఖ్య పెంచి, పెరిగిన ధరలకు అనుగుణంగా కూలి రేట్లు పెంచమని కూలీలు డిమాండ్ చేస్తున్న స్పందించడం లేదని, దేశవ్యాప్తంగా కార్మిక హక్కులకు నష్టం కలిగించే విధంగా నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చి కార్మిక వర్గానికి నష్టం కలిగిస్తున్నదని, జాతీయ రహదారులు, ప్రాజెక్టులు, పరిశ్రమల పేరుతో రైతుల నుండి బలవంతంగా భూములు లాక్కొని కార్పొరేట్ కంపెనీలకు అప్పగిస్తు, 2013 భూ సేకరణ చట్టం ప్రకారం రైతాంగానికి నష్టపరిహారం చెల్లించి, భూములు తీసుకోమని కోరితే రైతుల పైన లాఠీచార్జీలు నిర్బంధాలు ప్రయోగిస్తున్నారని,ఈ విధానాలను అన్నింటినీ కారణమైన కేంద్ర బిజెపి ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ, దేశవ్యాప్తంగా జనవరి 26వ తేదీన అన్ని జిల్లా కేంద్రాలలో రైతు సంఘాల సమన్వయ కమిటీ, మరియు కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కార్మికులు కర్షకులు నిర్వహిస్తున్న ట్రాక్టర్ బైక్ ర్యాలీలు నిర్వహించడం జరిగిందని,అందులో భాగంగానే మన నంద్యాల జిల్లా కేంద్రంలో జరుగుతున్న ర్యాలీలో జిల్లాలోని రైతులు కూలీలు కార్మికులు పాల్గొని జయప్రదం చేయవలసిందిగా కోరారు.

## మణిపూర్‌లో సహచరులపై కాల్పులు

**- తనని తాను కాల్చుకున్న జవాన్**



**టీ మీడియా, జనవరి 24, ఇంఫాల్ :** మణిపూర్‌లో ఓ జవాన్ తన సహచరులపై కాల్పులు జరిపిన అనంతరం తనను తాను కాల్చుకున్నారు. బుధవారం ఉదయం జరిగిన ఈ ఘటనలో ఆరుగురు జవాన్‌లకు గాయాలైనట్లు అధికారులు తెలిపారు. దక్షిణ మణిపూర్‌లోని భారత్ -మయన్మార్ సరిహద్దుకు సమీపంలో మోహరించిన పారామిలటరీ దళానికి చెందిన బెటాలియన్‌లో అస్సాం రైఫిల్స్ జవాన్ ఈ కాల్పులు జరిపారు. కార్మికుల పరిస్థితి నిలకడగా ఉందని అధికారులు తెలిపారు. సమీప జిల్లాకు చెందిన ఈ జవాన్ జనవరి 20న సెలవుల నుండి తిరిగి విధుల్లోకి వచ్చారని పోలీసులు తెలిపారు. గాయపడిన జవాన్లందరూ మణిపురీయేతరులని అన్నారు. దీంతో ఈ దురదృష్టఘటనకు మణిపూర్‌లో కొనసాగుతున్న ఉద్రిక్తతలతో ఎలాంటి సంబంధం ఉండకపోవచ్చని భావిస్తున్నట్లు అస్సాం రైఫిల్స్ అధికారి ఒకరు తెలిపారు. ఈ ఘటనపై విచారణకు ఆదేశించామని అన్నారు.

## కెనడాలో కూలిన విమానం.. ఆరుగురు మృతి



**టీ మీడియా, జనవరి 24, ఒట్టావా :** కార్మికులతో వెళుతున్న ఓ విమానం కుప్పకూలింది. కెనడాలోని నార్త్‌వెస్ట్ టెరిటరీస్‌లో జరిగిన ఈ ప్రమాదంలో ఆరుగురు కార్మికులు మరణించినట్లు అధికారులు తెలిపారు. రియో టింటో మైనింగ్ సంస్థకు చెందిన దియావిక్ వజ్రాల గని వద్దకు కొందరు కార్మికులతో ఫోర్ట్‌స్మిత్ నుంచి బుధవారం ఉదయం 8.50 గంటలకు ఛార్టర్ ఫ్లైట్ బయలుదేరింది. టేకాఫ్ అయిన కొద్దిసేపటికే ఛార్టర్ ఫ్లైట్‌కి ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌తో సంబంధాలు తెగిపోయాయి. రన్‌వే చివర నుంచి కిలోమీటర్ పరిధిలో విమానం కుప్పకూలిందని అధికారులు గుర్తించారు. ఈ ఘటనలో ఆరుగురు మృతి చెందారు. దీంతో ఫోర్ట్ స్మిత్ నుండి అన్ని విమానాలను తాత్కాలికంగా నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు. ఘటనపై దర్యాప్తు చేపట్టేందుకు కెనడా రవాణా భద్రతా బోర్డు ప్రత్యేక బృందాన్ని నియమించింది.

## సర్పంచుల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

**- సీఎంకి బండి సంజయ్ లేఖ**





**టీ మీడియా, జనవరి 24, కరీంనగర్ :** కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. సర్పంచుల పెండింగ్ బిల్లుల విడుదలకు వెంటనే ఉత్తర్వులు ఇవ్వాలని లేఖలో కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 50 రోజులు కావస్తున్నా సర్పంచుల పెండింగ్ బిల్లులపై దృష్టి సారించకపోవడం దురదృష్టకరం అని ఆయన పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో సర్పంచుల పెండింగ్ బిల్లులను అధికారంలోకి వచ్చిన వెంటనే చెల్లిస్తామని హామీ ఇచ్చిన మీరు ఈ అంశాన్ని పట్టించుకోకపోవడం శోచనీయం అని బీజేపీ ఎంపీ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే సర్పంచుల సంఘం ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేయాలి అని బండి సంజయ్ డిమాండ్ చేశారు.కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం గ్రామాలకు కేటాయించిన నిధులను గత బీఆర్ఎస్ ప్రభుత్వం దారిమళ్లించింది అని ఎంపీ బండి సంజయ్ ఆరోపించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో పెండింగ్ బిల్లుల కారణంగా రాష్ట్రంలో సర్పంచులు ఆత్మహత్యలు చేసుకున్నారు అనే విషయాన్ని ఆయన గుర్తు చేశారు. గ్రామాభివృద్ధి కోసం చేసిన పనులను కూడా ప్రభుత్వ అధికారులు రికార్డు చేయకుండా సర్పంచులను ఇబ్బంది పెడుతున్నారు.. గ్రామాభివృద్ధికి సర్పంచులు చేసిన పనులను వెంటనే రికార్డు చేసేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలన్నారు.

## మింట్ కాంపౌడ్‌లో ఘోర అగ్ని ప్రమాదం



**టీ మీడియా, జనవరి 24, హైదరాబాద్ :** సచివాలయం సమీపంలోగల మింట్ కాంపౌండ్‌లోని ప్రభుత్వ పుస్తక ముద్రణా కార్యాలయంలో అగ్ని ప్రమాదం సంభవించింది. బుధవారం తెల్లవారుజామున ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ అగ్నిప్రమాదంలో ప్రింటింగ్ ప్రెస్‌లోని పుస్తకాలు, ముద్రణా యంత్రాలు అగ్నికి ఆహుత య్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకుని మంటలను ఆర్పేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ అగ్నిప్రమాదం జరిగి ఉంటుందని అగ్నిమాపక శాఖ అధికారులు అనుమానిస్తున్నారు.

## మహానందిలో ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు



**టీ మీడియా, జనవరి 24, మహానంది:** మహానంది పుణ్యక్షేత్రంలో ఎల్ఈడీ లైట్లు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ.. ఆలయ అర్చకులు దోర్నిపాటి సురేంద్ర తన తండ్రి పూర్వపు సీనియర్ అర్చకులైన దోర్నిపాటి సుబ్రహ్మణ్యం జ్ఞాపకార్థంగా, మహానంది గర్భాలయం చుట్టూ అంతరాలయ మండపంలో పాతబడిన విద్యుత్ దీపాల స్థానంలో సుమారు 70 వేల రూపాయలతో నూతన ఎల్ఈడీ లైట్లను ఏర్పాటు చేశారని తెలిపారు.

## సూక్ష్మ, లఘు, మధ్య తరహా పరిశ్రమలకు ప్రొత్సహిస్తాం

**- డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క**




**టీ మీడియా, జనవరి 24, హైదరాబాద్ :** దేశ, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలను మెరుగుపరచడానికి ఉత్పత్తి రంగంలో ఉన్నటువంటి వ్యవసాయం నుంచి పారిశ్రామికీకరణ వైపు నడిపించడానికి గత ప్రభుత్వ పెద్దలు చేసిన ప్రణాళికలు దేశాన్ని ముందుకు నడిపిస్తున్నాయన్నారు రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క. మైక్రో స్మాల్ మీడియం ఎంటర్ ప్రైజెస్ డెవలప్మెంట్ అండ్ ఫెసిలిటేషన్ ఆధ్వర్యంలో గురువారం టూరిజం ప్లాజాలో నిర్వహించిన వెండర్స్ డెవలప్మెంట్ కార్యక్రమానికి ముఖ్య అతిథి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సువిశాలమైన భారతదేశంలో ఎన్ని వ్యత్యాసాలు ఉన్నప్పటికిని ఉత్పత్తి రంగాలన్నింటినీ పంచవర్ష ప్రణాళికలు గానీ మిశ్రమ ఆర్థిక వ్యవస్థలు దేశ పురోగతిలో కీలక పాత్రను పోషిస్తున్నాయన్నారు. ప్రపంచీకరణ సరళీకరణ వచ్చిన తర్వాత దేశంలోకి వచ్చిన తర్వాత మల్టీ నేషనల్ కంపెనీలు మైక్రో స్మాల్ ఇండస్ట్రీస్ ను మింగేశాయని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. వెల్త్ ఒకే చోట ఉండటం ప్రజాస్వామ్యానికి, సమాజానికి ప్రమాదకరమని అంటూ మైక్రో స్మాల్ ఇండస్ట్రీస్ ను ఇందిరమ్మ రాజ్యం కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తుందని చెప్పారు. ఉద్యోగ ఉపాధి కల్పన సమానత్వం సామాజిక న్యాయం వృద్ధిరేటు పెరగడానికి ఎంఎస్ఎంఈ తోడ్పాటు అవుతుంది అని తెలిపారు. భూతద్దంలో పెట్టి వెతికిన మల్టీ నేషనల్ కంపెనీల వల్ల సామాజిక న్యాయం సమానత్వం ఉద్యోగ ఉపాధి కల్పన కనిపించదు అని చెప్పారు.. మల్టీ నేషనల్ కంపెనీలతోనే అభివృద్ధి సాధ్యం అన్నది గ్లోబల్స్ ప్రచారం మాత్రమేనని అయన అభిప్రాయపడ్డారు.. ఇండస్ట్రియల్ క్లస్టర్స్ ను పెంచుతామని, ప్రభుత్వ పరంగా ప్రోత్సహకాలు ఇస్తామని హామీ ఇచ్చారు.. ఇండస్ట్రియల్ క్లస్టర్స్ పెంచి యువ పారిశ్రామికవేత్తలకు ఆర్థికంగా, మేధోపరంగా సహకారం అందిస్తే పెద్ద ఎత్తున ఉద్యోగ ఉపాధి కల్పన పెరుగుతుందని అన్నారు. దీని వల్ల దేశ వృద్ధిరేటు పెరగడానికి దోహదపడుతుంది అని ఆయన పేర్కొన్నారు. వనరులు సమానంగా పంచి, సంపద సృష్టించే రంగాల్లో అందరిని భాగస్వాములు చేయడం వల్లనే సమ సమాజ స్థాపన జరుగుతుందని తేల్చి చెప్పారు. సంపద సృష్టించే రంగాల్లో అందరిని భాగస్వామ్యం చేయకుంటే దేశంలో అసమానతలు పెరిగిపోవడం ఈ సమాజానికి, ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. ఎస్సీ, ఎస్టీ యువ పారిశ్రామికవేత్తలకు కాంగ్రెస్ ప్రభుత్వం సరైన ప్రాధాన్యత ప్రోత్సాహకాలు అందిస్తుందని వెల్లడించారు%ొ%. సూక్ష్మ, లఘు, మధ్య తరహా పరిశ్రమలకు మరిన్ని రాయితీలు, ప్రోత్సాహకాలు ఇవ్వడానికి ఈ ప్రభుత్వం సిద్ధంగానే ఉంటుంది అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు.

# ‘పార్టీ మారే ఉద్దేశమే లేదు

**సీఎం రేవంత్‌తో భేటిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు క్లారిటీ**




**టీ మీడియా, జనవరి 24, హైదరాబాద్ :** తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ, పార్టీ మారుతారన్న ప్రచారంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వివరణ ఇచ్చారు. పార్టీ మారుతున్నట్లు వస్తున్న వార్తలను ఖండించారు ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి. తాము ఎవరితోనూ చర్చలు జరపడంలేదని, ప్రొటోకాల్, ఎస్కార్ట్ ఇవ్వడం లేదని సీఎం రేవంత్ రెడ్డిని కలిసి ఫిర్యాదు చేశామన్నారు. దాంతోపాటు ఉమ్మడి మెదక్‌జిల్లా సమస్యలపై చర్చించామని ఆమె తెలిపారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వంలోనే పనిచేస్తామన్నారు. తమకు పార్టీ మారే ఉద్దేశం తమకు లేదని, కొందరు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని ఫైరయ్యారు సునీతా లక్ష్మారెడ్డి.మా నియోజకవర్గ సమస్యలపై చర్చించేందుకే సీఎం రేవంత్‌రెడ్డిని కలిశామన్నారు బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి. కాంగ్రెస్‌లో చేరుతున్నామనే ప్రచారాన్ని ఖండించారు. గతంలో మెదక్ లోక్‌సభ నియోజకవర్గ సమస్యలపై ప్రధాని మోదీ, కేంద్రమంత్రులను కలిశానన్నారు.అదే విధంగా దుబ్బాక సమస్యలపై సీఎం, మంత్రులను కూడా కలిశామన్నారు. ఇందులో తప్పేముందని ప్రశ్నించారు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి.పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్?రెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు మంగళవారం ఇంటెలిజెన్స్?చీఫ్?శివధర్‌రెడ్డిని కలిసి ప్రొటోకాల్?ఉల్లంఘనలపై ఫిర్యాదు చేశారు. ఎలాంటి పదవులు లేని నాయకులు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని, రాజ్యాంగం కల్పించిన ప్రొటోకాల్ హక్కును ఉల్లంఘిస్తే రాజకీయ సమస్యలు ఏర్పడే ప్రమాదం ఉందని తెలిపారు. అధికారిక కార్యక్రమాలకు పోలీస్ ఎస్కార్ట్ తొలగిస్తున్నారని, వెంటనే ఈ అంశాలపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కోరారు. మొత్తానికి సీఎం రేవంత్‌ను కలవడంతో నలుగురు ఎమ్మెల్యేలు పార్టీ మారుతున్నారనే వార్తలు దుమారం రేపడంతో వివరణ ఇచ్చారు.

## అన్యాక్రాంతమైన దేవాదాయ భూముల స్వాధీనమే మా ప్రాధాన్యం

**–ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి, మంత్రి కొండా సురేఖ**



**టీ మీడియా, జనవరి 24, హైదరాబాద్ :** రాష్ట్రంలో టెంపుల్ టూరిజం అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో పాటు దేవాలయ ఖాళీ భూముల్లో ఆలయ సందర్శకుల సౌకర్యార్థం కాటేజీలు నిర్మించే విధంగా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. డా.బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన దేవాదాయ శాఖ, పర్యావరణ, అటవీ శాఖల కు సంబంధించి బడ్జెట్ అంచనాల ముందస్తు సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు, ఎండోమెంట్స్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సునీల్ శర్మ, పర్యావరణ, అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి వాణీ ప్రసాద్, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఎన్నో ప్రముఖ దేవాలయాలు, ప్రార్థనాలయాలున్న తెలంగాణా రాష్ట్రంలో టెంపుల్ టూరిజం అభివృద్ధికి విస్తృత అవకాశం ఉందని, ప్రధానంగా ఇతర రాష్ట్రాలకు చెందిన భక్తులు మరింత ఎక్కువ సంఖ్యలో సందర్శించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. పెద్దగా ఆదాయం లేని దేవాలయాలకు దూప దీప నైవేద్యం కింద ఆర్థిక సహాయాన్ని అందించే పథకాన్ని మరింత సరళతరం చేయాలని సూచించారు. ప్రధానంగా అటవీ శాఖతో కలిసి టెంపుల్ టూరిజాన్ని, ఏకో టూరిజంతో కలిపి టూరిస్ట్ సర్క్యూట్స్ లను ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలో నాగోబా, మేడారం లాంటి గిరిజన జాతరలకు సంబంధించి దేశ, విదేశీ పర్యాటకులను ఆహ్వానించేలా ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని చెప్పారు.

**అటవీ ప్రాంతాల్లో సఫారీ, ఎకో టూరిజం..**

రాష్ట్రంలో అటవీ సంపద, వన్య ప్రాణుల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత నివ్వడంతోపాటు, ఏజెన్సీ, అటవీ భూముల్లో గిరిజనులకు ఆర్థిక పరమైన మేలు జరిగేలా ఆయుర్వేద సంబంధిత మెడిసినల్ ప్లాంటేషన్ లను చేపట్టాలని తెలిపారు. రాష్ట్రంలో ఆయుష్ శాఖ, ఆయుర్వేద మందుల కంపెనీలతో ఈ మెడిసినల్ ప్లాంటేషన్ లకు సంబంధించి మార్కెటింగ్ కు అనుసందానం చేయాలని అన్నారు. అటవీ ప్రాంతాల్లో సఫారీ, ఎకో టూరిజంకు నగర వాసుల్లో మంచి ఆదరణ ఉందని ,ఈ విధమైన పర్యాటకాభివృద్ధి ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇవ్వాలని భట్టి విక్రమార్క చెప్పారు. అటవీ ప్రాంతాల్లో వివిధ అవసరాలకు సోలార్ పవర్ యూనిట్లను ఏర్పాటు చేయాలన్నారు.తిరుపతిలో తెలంగాణ భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు?ఈ సందర్భంగా దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, రాష్ట్రంతోపాటు ఇతర రాష్ట్రాల్లో ఉన్న దేవుడి మాన్యాల పరిరక్షణతో పాటు, అన్యాక్రాంతమైన భూములను తిరిగి స్వాధీనం చేసుకోవడానికి అత్యంత ప్రాధాన్యత నిస్తున్నామని తెలియ చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానానికి తెలంగాణకు చెందిన భక్తులు అత్యధికంగా సందర్శిస్తూ, గణనీయమైన ఆర్థిక వనరులు సమకూరుస్తున్నప్పటికీ, తెలంగాణా భక్తులకు కూడా తిరుమలలో ప్రాధాన్యత నిచ్చేలా చూడాలని ఉప ముఖ్యమంత్రిని కోరారు. అలాగే, వన్యప్రాణుల దాడుల్లో ఎవరైనా మరణిస్తే పరిహారాన్ని రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షకు తమ ప్రభుత్వం పెంచిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో బయోడైవర్సిటీ మేనేజ్మెంట్ కమిటీలను తిరిగి పునరుద్ధరించనున్నట్టు తెలిపారు. దేవాదాయ, అటవీ శాఖలకు సంబంధించి ప్రతిపాదిక బడ్జెట్ నిధులను ఉదారంగా కేటాయించాలని మంత్రి కొండా సురేఖ విజ్ఞప్తి చేశారు.

## నూతన గ్రామపంచాయతీ భవనాలను ప్రారంభించిన ఎమ్మెల్యే



**టీ మీడియా, జనవరి 24, జన్నారం:** మండలంలోని ఇంధనపెల్లి, కవ్వాల్, జన్నారం, ధర్మారం గ్రామాలలో నూతన గ్రామపంచాయతీ భవనాలను బుధవారం రోజున ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ప్రారంభించారు.అనంతరం మండల కేంద్రంలోని పైడిపెల్లి గార్డెన్ లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ శాసనసభ ఎన్నికలకు ఎలాగైతే కాంగ్రెస్ పార్టీ గెలుపునకు పోరాడారో, అంతే దృక్పథం తో రానున్న లోకసభ ఎన్నికలకు కూడా ప్రతి ఒక్క కార్యకర్త సైనికుడి లా పనిచేసి కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి చేయాలని అన్నారు. నాయకుడినిగా మీ ముందుకు రాలేదని మీకు సేవకుడిగా మీ ముందుకు వచ్చానని ప్రతి ఒక్కరికి అన్నివేళలా అందుబాటులో ఉంటానని, సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ముజాఫర్ అలీ ఖాన్, మేకల మాణిక్యం, జన్నారం ఎంపీటీసీ రియాజుద్దీన్, సీనియర్ నాయకులు మిక్కిలినేని రాజశేఖర్, ఏనుగు సుభాష్ రెడ్డి, సయ్యద్ ఇసాక్, గుర్రం మోహన్ రెడ్డి, మచ్చ శంకరయ్య, దాముఖ కరుణాకర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ముత్యం సతీష్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మున్ను ,రజాక్, ఆప్షన్ సభ్యుడు పసి ఉల్లా, ఎన్ ఎస్ యు ఐ నాయకులు సోహిల్, అజ్మత్, యూత్ నాయకులు రాకేష్ ,రాజేష్, ముజ్జు, రాహుల్, మహేష్, నాయకులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

## ముమ్మరంగా వాహనాల తనిఖీలు




**టీ మీడియా, జనవరి 24, మహానంది:** మహానంది మండలం గాజులపల్లె గ్రామ పరిధిలోని ఆంజనేయపురం చెక్ పోస్ట్ వద్ద బుధవారం పోలీసులు విస్తృతంగా వాహనాలు తనిఖీలు చేపట్టారు.నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి ఆదేశాల మేరకు నంద్యాల రూరల్ సీఐ శివకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని కార్లు, జీపులు, ఆటోలు, ట్యాక్సీలు, డీసీఎంలు, తదితర వాహనాలను తమ పోలీస్ సిబ్బందితో ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు.ఈ సందర్భంగా సిఐ శివకుమార్ రెడ్డి మాట్లాడుతూ వాహనాలలో డబ్బులు, ఇతర వస్తువులపై ప్రత్యేక నిఘా పెట్టారని,ప్రతి వాహనాన్ని పూర్తి స్థాయిలో తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు.ఈ తనిఖీల్లో మహానంది ఏఎస్ఐ రామకృష్ణ, పోలీస్ సిబ్బంది ప్రసాద్, రసూల్,నూర్ బాషా,మాభువలి పాల్గొన్నారు.



## లోక్‌సభ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీచేస్తాం

**- పశ్చిమబెంగాల్ సిఎం మమతా బెనర్జీ**

**టీ మీడియా, జనవరి 24, కోల్‌కతా :** పశ్చిమబెంగాల్‌లోని 42 లోక్‌సభ ఎన్నికల్లో తాము ఒంటరిగా పోటీ చేస్తామని తృణమూల్ కాంగ్రెస్ అధ్యక్షురాలు, రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ బుధవారం స్పష్టం చేశారు. కాంగ్రెస్‌తో తమ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని అన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా ఫోరంను పరిగణనలోకి తీసుకుంటామని అన్నారు. "మాకు కాంగ్రెస్‌తో ఎలాంటి సంబంధాలు లేవు. బెంగాల్‌లో తమ పార్టీ ఒంటరిగానే పోటీచేస్తుంది. సార్వత్రిక ఎన్నికల అనంతరం ఇండియా ఫోరంపై నిర్ణయం తీసుకుంటాం" అని అన్నారు. రాహుల్ గాంధీ చేపడుతున్న భారత్ జోడో న్యాయ్ యాత్ర ఇండియా ఫోరంలోని పార్టీల మధ్య అంతరాలకు దారితీస్తున్న సంగతి తెలిసిందే. తమ పార్టీకి, కాంగ్రెస్‌కు మధ్య పెరుగుతున్న వైరుధ్యాన్ని ఉద్ఘాటించారు. మరికొన్ని రోజుల్లో రాహుల్ యాత్ర తమ రాష్ట్రంలోకి ప్రవేశించనుందని, కానీ తనకు సమాచారం ఇవ్వాలన్న కనీస మర్యాద పాటించలేదని మండిపడ్డారు.



## ఏపీ కాంగ్రెస్ అభ్యర్థుల దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం

**టీ మీడియా, జనవరి 24, విజయవాడ :** ఏపీ అసెంబ్లీ ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ కసరత్తులు ప్రారంభించింది. అసెంబ్లీతో పాటు పార్లమెంట్ ఎన్నికల అభ్యర్థుల కోసం దరఖాస్తు స్వీకరణ ప్రక్రియను ప్రారంభించింది. బుధవారం ఉదయం ఆశావహులు అప్లికేషన్లను విజయవాడలోని పార్టీ కార్యాలయంలో ఏపీ వ్యవహారాల ఇంఛార్జి మాణిక్యం ఠాగూర్‌కు అందించారు. ప్రతీ కాంగ్రెస్ కార్యకర్తకు అప్లికేషన్ సమర్పించే అవకాశం ఉందని మాణిక్యం ఠాగూర్ వెల్లడించారు. కాగా మొదటి అప్లికేషన్ మడకశిర నుంచి సుధాకర్ సమర్పించగా.. రెండవ అప్లికేషన్ గుంటూరు తూర్పు నుంచి మస్తాన్ వలీ ఇచ్చారు. మూడవ అప్లికేషన్ బద్వేల్ నుంచి కమలమ్మ అందజేశారు.




## రాహుల్ భద్రతపై అమిత్ షాకు లేఖ రాసిన ఖర్గే

**టీ మీడియా, జనవరి 24, ఢిల్లీ:** అస్సాంలో రాహుల్ గాంధీ భద్రతపై ఆందోళన వ్యక్తం చేస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు లేఖ రాశారు. అస్సాంలో భారత్ జోడో న్యాయ్ యాత్ర సందర్భంగా రాహుల్ కు భద్రత కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని, అనేక భద్రతా లోపాలు వెలుగుచూశాయని ఖర్గే వివరించారు. పలు అంశాలను తన లేఖలో ప్రస్తావించారు. ముఖ్యంగా, జనవరి 22న నాగావ్ జిల్లాలో రాహుల్ గాంధీ కాన్వాయ్ ని బిజెపి కార్యకర్తలు అడ్డుకున్నారని, వారు రాహుల్ గాంధీకి అత్యంత సమీపానికి వచ్చారని ఖర్గే ఆందోళన వ్యక్తం చేశారు. ఓ జాతీయ స్థాయి నేత కాన్వాయ్ లోకి ఇతరులు చొరబడి సమీపానికి రావడం అత్యంత అభద్రతో కూడిన పరిస్థితి అని వివరించారు. ఇంత జరుగుతున్నా అస్సాం పోలీసులు ప్రేక్షకుల్లా చూస్తూ ఉన్నారని, కొన్నిసార్లు పోలీసులే దగ్గరుండి బిజెపి కార్యకర్తలను రాహుల్ కాన్వాయ్ లోకి పంపించారని ఖర్గే పేర్కొన్నారు. ఇప్పటివరకు అస్సాం పోలీసులు ఎవరినీ అరెస్ట్ చేయకపోవడం శోచనీయం అని పేర్కొన్నారు. రాహుల్ యాత్ర ముందుకు సాగేకొద్దీ%ొ% ముప్పు అధికమవుతోందని, ఇకనైనా మీరు జోక్యం చేసుకోవాలని అమిత్ షాను కోరారు. రాహుల్ యాత్రకు తగిన భద్రత కల్పించేలా అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ, డిజిపిలకు దిశానిర్దేశం చేయాలని ఖర్గే తన లేఖలో విజ్ఞప్తి చేశారు.



## గాంధీభవన్లో తమ గోడు వెల్లబుచ్చిన టిబెట్ ఎంపీలు

**టీ మీడియా, జనవరి 24, హైదరాబాద్ :** చైనా ఆక్రమించిన టిబెట్ భూభాగం విషయంలో తమకు మద్దతు ఇవ్వాలని టిబెట్ ఎంపీలు కాంగ్రెస్ నేతలను కోరారు. చైనా ఆక్రమిత ప్రాంతంలో తమకు కనీస హక్కులు, పత్రిక స్వేచ్ఛ లేదని అవేదన వ్యక్తం చేశారు. టిబెట్ ఎంపీలు హైదరాబాద్‌లో ఏఐసీసీ ఇంచార్జ్ దేపాదాస్ మున్షీ, వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్ గౌడ్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, ఏఐసీసీ కార్యదర్శులు రోహిత్ చౌదరీ, మన్సూర్ అలీ ఖాన్?తోపాటు రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలు కలిశారు. చైనా ఆక్రమిత టిబెట్‌లో తమకు మాట్లాడే హక్కులేదని తమ పరిస్థితి దారుణంగా ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం బాధితులుగా ఉన్నామని వివరించారు. కాంగ్రెస్ పార్టీ నుంచి సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. టిబెట్ ఎంపీల సమస్యల పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు కాంగ్రెస్ నేతలు.

## కారు ప్రమాదంలో మమతా బెనర్జీ తలకు స్వల్పగాయం



**టీ మీడియా, జనవరి 24,కోల్‌కతా :** పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రయాణిస్తున్న కారు బుధవారం ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో ఆమె తలకు స్వల్పగాయమైనట్లు అధికారులు తెలిపారు. బర్ధమాన్ నుండి కోల్‌కతా వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది.అననుకూల వాతావరణం కారణంగా హెలికాప్టర్ ప్రయాణం రద్దవడంతో కారులో కోలకతాకు బయల్దేరారు. అయితే పొగమంచు కారణంగా ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించని పరిస్థితి. దీంతో డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో ఎదురు సీటులో కూర్చున్న మమతా బెనర్జీ .. విండ్‌స్క్రీన్‌ను ఢీ కొన్నారు. దీంతో ఆమె తలకు స్వల్పగాయమైంది. కోల్‌కతాలో వైద్యులు పరీక్షించినట్లు అధికారులు తెలిపారు.

# గంజాయి చాక్లెట్లు అమ్ముతున్న వ్యక్తి అరెస్ట్

**టి మీడియా, జనవరి 24,పెద్దపల్లి :**తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలని దురాశతో గంజాయి చాక్లెట్లు అమ్ముతున్న వ్యక్తిని పెద్దపల్లి పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు.నిందితుడి వద్ద నుంచి గంజాయి చాక్లెట్స్ స్వాధీనం చేసుకొన్నారు. ఈ సందర్భంగా పెద్దపల్లి ఎస్ఐ మల్లేష్ మీడియాకు విరాలను వెల్లడించారు. పెద్దపెల్లి పట్టణానికి చెందిన అన్సారీ అనే వ్యక్తి కష్టపడకుండా డబ్బులు సంపాందించాలని తప్పుడు మార్గాన్ని ఎంచుకున్నాడు.ఇందుకోసం కాలేజీలు ఎక్కువగా ఉన్న ఏరియాలను టార్గెట్‌గా చేసుకొని



ఉత్తరప్రదేశ్ నుంచి గంజాయి చాక్లెట్స్ తెప్పించి విక్రయిస్తున్నాడని తెలిపారు.విశ్వసనీయ సమాచారం మేరకు బుధవారం పట్టణంలోని అమర్ నగర్‌లో నిందితుడిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు..

## విద్యార్థులకు రక్తహీనత పరీక్షలు

### - అంతర్జాతీయ బాలికా దినోత్సవం


**టీ మీడియా, జనవరి 24, గోదావరిఖని** : రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమం కమిషనర్ ఆదేశాను సారం పెద్దపల్లి జిల్లా ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్ డిఐఓ డాక్టర్ కృపా బాయ్,ఆర్ బిఎస్ కే నోడల్ ఆఫీసర్ డాక్టర్ సంజీవ్ ఆధ్వర్యంలో గోదావరిఖని లోని బాలికల జడ్పీ హైస్కూల్ నందు బుధవారం ఎనీమియా ముక్త్ భారత్ లో భాగంగా విద్యార్థులకు రక్త పరీక్ష రక్తహీనత గురించి తెలుపుతూ వారిలో



అవగాహన పెంచి రక్తహీనత నుంచి విముక్తి కలిగించి లోపాలున్న వారికి మాత్రలు ఇచ్చి ఇతర చికిత్సలు చేసి ఆహారపు అలవాటుల గురించి తెలపడం జరిగింది.ఈ కార్యక్రమంలో గోదావరిఖని ఆర్ బి ఎస్ కే టీమ్ డాక్టర్ చేరాలు ఎండి,జె రాజేష్,ఫారో, ఏం.సరోజ ఏఎన్ఎం, ప్రధానోపాధ్యాయులు మల్లేష్,శాస్త్రి రాజమల్లు, విద్యార్థులు, పాల్గొన్నారు.

## కూలిన రష్యా సైనిక విమానం.. 65 మంది మృతి

**టీ మీడియా, జనవరి 24,బెల్గోరోడ్** :రష్యాలో ఘోర విమాన ప్రమాదం జరిగింది. 65 మంది యుద్ధ ఖైదీలతో వెళ్తున్న రష్యా విమానం కుప్పకూలింది. క్రాష్ తర్వాత విమానం మంటల్లో చిక్కుకుంది. రష్యాకు చెందిన %×ూ%-76, హెవీ లిఫ్ట్ మిలిటరీ ట్రాన్స్‌పోర్ట్ ఎయిర్‌క్రాఫ్ట్ 65 మంది ఉక్రెయిన్ ప్రిజనర్స్ ఆఫ్ వార్స్ తో ప్రయాణిస్తున్న సమయంలో రష్యాలోని బెల్గోరోడ్ ప్రాంతంలో




కూలిపోయింది. విమాన కూలిన ఘటనను రష్యా మంత్రిత్వ శాఖ ధృవీకరించింది. ఈ ఘటనలో ఉక్రెయిన్ యుద్ధంలో రష్యాకు పట్టుబడిన 65 మంది ఉక్రెయిన్ సైనికులను, యుద్ధ ఖైదీల మార్పిడి కోసం బెల్గోరోడ్ ప్రాంతానికి రవాణా చేస్తున్నట్లు తెలుస్తోంది. విమానంలో ఆరుగురు సిబ్బంది, ముగ్గురు ఎస్కార్ట్స్ ఉన్నారు. బెల్గోరోడ్ రాజధానికి ఈశాన్యంలో ఉన్న కోరోచన్స్కీ జిల్లాలో ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు ఆ ప్రాంత గవర్నర్ వ్యాచెస్లావ్ గ్లాడ్కోవ్ టెలిగ్రామ్‌లో తెలిపారు. విమానం కూలిపోయిన ఘటనకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి.




## నూతన జాతీయ విద్యా విధానంను రద్దు చేయాలి

### - ఏఐఎస్ఎఫ్

**టీ మీడియా, జనవరి 24, గోదావరిఖని :** రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి పిలుపులో భాగంగా బుధవారం విద్యార్థులతో నూతన జాతీయ విద్య విధానాన్ని రద్దు చేయాలని సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టడం జరిగిందని ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు రేణుకుంట్ల ప్రీతం అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బిజెపి ప్రభుత్వం విద్య కాషాయకరణ, మూఢనమ్మకాలను పెంచి పోషిస్తున్నదని, విద్య వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించేంతవరకు పోరాడాలని ఆయన అన్నారు.రాష్ట్రంలో పెండింగ్ లో ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని,రాష్ట్ర ప్రభుత్వం ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీ కోసం జాబ్ క్యాలెండర్ విడుదల చేసి, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇవ్వాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా సహాయ కార్యదర్శి మొలుగురి నితీలేష్, రామగుండం కార్పొరేషన్ కార్యదర్శి ఎల్కపెల్లి సురేష్, అధ్యక్షులు మాతంగి సాగర్,సుస్మిత, శ్వేత,అరుణ, పవన్ కళ్యాణ్ రాజు తదితరులు పాల్గొన్నారు.



## కూర్పురి ఠాకూర్ జయంతి వేడుకలు

**టీ మీడియా, జనవరి 24, జన్నారం:** బీహార్ మాజీ ముఖ్యమంత్రి నాయి బ్రాహ్మణ మంగలి కులానికి చెందిన కర్పూరి ఠాకూర్ 100వ జయంతి సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఆయనకు "భారతరత్న" బిరుదును ప్రకటించారు .ఈ సందర్భంగా మండల కేంద్రంలో మండల నాయీబ్రాహ్మణ సంఘం, బీసీ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం రోజున కర్పూరి ఠాకూర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఇరువూరు నాయకులు మాట్లాడుతూ కర్పూరీ ఠాకూర్ చిన్నప్పటి నుండి విప్లవ భావాలు ఎక్కువ అనీ, కాలేజీ విద్యను మద్యలోనే వదిలేసి భారత స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారనీ, క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నందుకు బ్రిటీష్ ప్రభుత్వం ఠాకూర్ ను 1942- 1945 లో అరెస్టు చేసి జైల్లో వేసిందనీ స్వాతంత్ర్య సిద్ధంచాక మొదట్లో గ్రామంలో టీచర్ గా పని చేసినారనీ, బీహార్ లో బీ సీ లకు 26 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న మంగేరీ లాల్ కమీషన్ సిఫారసులను 1978 లో అమలు చేశారు అని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేందర్, నాగేందర్, రమణ, రవి, శశిధర్, ప్రశాంత్, లక్ష్మణ్, గంగన్న, సత్తన్న,గంగారం, రవి ,శేఖర్, బాపన్న, నరసింహులు, చంద్రయ్య, శ్రీనివాస్, రాజన్న ,సక్రు నాయక్, నరసయ్య, వేణుగోపాల్, శ్రీధర్ ,తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఈబి దాడులు

**టీ మీడియా, జనవరి 24, మహానంది:** మహానంది మండలంలో బుధవారం ఎస్ ఈ బి అధికారులు దాడులు నిర్వహించారు. బొల్లవరం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి నుండి పరిమితికి మించి మద్యం బాటిళ్ళు దొరికినట్లు ఎస్ ఈ బి సిఐ విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రస్తుతం దాడులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరిమితికి మించి దొరికిన వాటిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేనున్నట్లు సమాచారం. సారా అక్రమ మద్యం రవాణా బెల్టు షాపు నిర్వాహకులపై దాడులు నిర్వహించి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో ఎలాంటి అక్రమ మద్యం రవాణా తయారీ క్రయ విక్రయాలపై దృష్టి పెట్టామని చట్టాన్ని అతిక్రమించి క్రయ విక్రయాలు తయారీ చేస్తూ ఉన్నటువంటి వారిపై చర్యలు తీసుకోవడానికి వెనకాడ బోమని నిర్వాహకులకు హెచ్చరిస్తున్నట్లు తెలిపారు.



## ప్రజలందరికి ఉపకారం చేసేందుకే సియం జగన్ ఉన్నారు

### -డిప్యూటీ సిఎం ముత్యాలనాయుడు

**టీ మీడియా, జనవరి 24, మాడుగుల:**ప్రతి సామాన్యుడు సంఘంలో అసమానతలకు లోను కాకుండా జీవనం సాగించేందుకు ప్రతి గడపకు అవసరమైన సంక్షేమాన్ని అందిస్తున్నామని డిప్యూటీ సిఎం బూడి ముత్యాలనాయుడు తెలిపారు. రెండవ రోజు కోటపాడు, కె.ఎం.వల్లాపురం గ్రామలలో అయన పర్యటించారు. పలువురు ప్రజా ప్రతినిధులు, మండల అధికారులు సమిష్టిగా మంత్రి వెంట గ్రామ పర్యటన చేసి గ్రామస్థులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. సాంకేతిక కారణాల రీత్యా అగిన పథకాలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు మంత్రి సూచన చేశారు. పుట్టుకతో అనారోగ్య సమస్య తో ఉన్న బాలుడిని పరామర్శించి అర్థిక సహకారం చేశారు. ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి నేటి వరకు వైయస్సార్ ఆసరా, డ్వాక్రా, పింఛను, చేయూత, రైతు భరోసా వంటి సంక్షేమ పథకాల ద్వారా తమ కుటుంబానికి 5,78,267/- లక్షల రూపాయల లబ్ధి చేకురిందని మంత్రికి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల జెడ్పీటీసీ కీముడు రమణమ్మ, మాజీ ఎంపీపీ రామ ధర్మజా, మండల పార్టీ అధ్యక్షులు రాజారాం, మాడుగుల మార్కెట్ కమిటీ చైర్మన్ సేనాపతి కొండలరావు, గ్రామ సర్పంచులు కరణం రాము, కరణం రాము, మండల గ్రామస్థాయి నాయకులు, అధికారులు పార్టీ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## న్యాయం చేయండి ,సిఎంకు ఆర్టీసీ ఉద్యోగుల మొర

**టీ మీడియా, జనవరి 24, హైదరాబాద్ :**సీఎం రేవంత్ రెడ్డిని కలిసేందుకు ఆయన నివాసం వద్దకు ఆర్టీసీ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో వచ్చారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చారు. గత ప్రభుత్వంలో తమకు అన్యాయం జరిగిందని తమ గోడును సీఎంకు చెప్పుకునేందుకు వచ్చామని ఈ సందర్భంగా వారు తెలిపారు. చిన్న చిన్న కారణాలతో దాదాపు 1,500 మందిని ఉద్యోగాల నుంచి తీసేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తమను విధుల్లోకి తీసుకోవాలని కోరారు. కాగా, రేవంత్ ఇంటి వద్ద పోలీసులు వారిని అడ్డుకున్నారు. సీఎంను కలిసి వినతిపత్రం ఇచ్చేందుకు ముగ్గురికి మాత్రమే అనుమతిని ఇచ్చారు. అనంతరం వారు రేవంత్ తమ గోడును వినిపించారు.. దీనికి రేవంత్ సానుకూలంగా స్పందించారు.

## నీటి సంపులో పడి చిన్నారి మృతి

**టీ మీడియా, జనవరి 24,దుగ్గొండి :** ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి చిన్నారి మృతి చెందిన ఘటన వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం చలపర్తి గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గుండెబోయిన కీర్తన జగదీష్‌ల పెద్ద కుమార్తె బుధవారం ఉదయం ఇంటి ముందు ఆడుకుంటూ వెళ్లి పక్కనే ఉన్న నీటి సంపులో పడిపోయింది. ఇంట్లో మరొక కుమార్తెను తీసుకొని తల్లి బయటికి రాగానే కూతురు కనిపించలేదు. అటు ఇటుగా వెతికిన తల్లి నీటి సంపులో పడిన కుమార్తెను చూడగా అప్పటికే మరణించిందని స్థానికులు తెలిపారు. ఇట్టి ఘటనపై పోలీసులను వివరణ కోరగా మృతురాలి తండ్రి జగదీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై జక్కుల పరమేష్ తెలిపారు.






### విచారణకు హాజరైన

# ఎన్ఆర్ఐ యశస్వి

### -సీఐడీ కార్యాలయం వద్ద ఉద్రిక్తత

**టీ మీడియా, జనవరి 24,గుంటూరు:** గుంటూరులోని సీఐడీ ప్రాంతీయ కార్యాలయం వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. టిడిపి ఎన్ఆర్ఐ కార్యకర్త బద్దులూరి యశస్వి (యష్) విచారణ దఅష్ట్యా తెలుగు యువత కార్యకర్తలు సీఐడీ కార్యాలయం వద్దకు భారీగా చేరుకున్నారు. విచారణ పేరుతో యశస్విని వేధిస్తున్నారని ఆందోళనకు దిగారు. కనీసం భోజనం ఇచ్చేందుకూ అనుమతించడం లేదని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీంతో.. అక్కడి నుంచి వెళ్లిపోవాలని ఆందోళనకారులను పోలీసులు హెచ్చరించారు.వైసిపి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి జగన్‌కు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినందుకు యష్‌పై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. వఅత్తి రీత్యా యష్ అమెరికాలో ఉన్నారు. గతేడాది డిసెంబర్ 23న తల్లి ఆరోగ్యం బాగాలేదని భారత్‌కు రావడంతో శంషాబాద్ విమానాశ్రయంలో సీఐడీ అధికారులు అరెస్టు చేసి గుంటూరుకు తరలించారు. నాలుగు గంటల తర్వాత 41ఏ నోటీసు ఇచ్చి విడిచిపెట్టారు. జనవరి 11న తిరుపతిలో సీఐడీ అధికారుల ఎదుట విచారణకు హాజరయ్యారు. తాజాగా బుధవారం మరోసారి గుంటూరు సీఐడీ కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు.



### బడ్జెట్ సమావేశాలకు

# 140 మంది సీఐఎస్ఎఫ్ సిబ్బంది పార్లమెంట్‌లో భద్రత

### -ఫోటో, వీడియోగ్రఫీ నిషేధం

**టి మీడియా, జనవరి 24, ఢిల్లీ :**

మోదీ ప్రభుత్వం రెండోసారి అధికారం చేపట్టిన తర్వాత చివరి పార్లమెంట్ సమావేశాలు జరుగనున్నాయి. ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు మంత్రి నిర్మలాసీతారామన్. పార్లమెంటు శీతాకాల సమావేశాల సందర్భంగా ప్రత్యేక భద్రత చర్యలు చేపట్టనున్నారు. 140 మంద సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ సిబ్బందిని పార్లమెంట్ కాంప్లెక్స్‌లో మోహరించారు. దీనితో పాటు, పార్లమెంట్ భవనం ఆవరణలో ఫోటోలు లేదా వీడియోలు తీసుకోవద్దని పార్లమెంట్ ఉద్యోగులను ఆదేశించింది.

ఫోటోగ్రఫీ-వీడియోగ్రఫీ నిషేధం

జనవరి 19న జారీ చేసిన సర్క్యులర్ ప్రకారం, "భారతదేశంలోని అత్యంత ప్రమాదకరమైన ప్రదేశాలలో పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్ ఒకటి. వ్యూహాత్మక భద్రతా ఏర్పాట్లలో భాగంగా పార్లమెంట్ కాంప్లెక్స్‌లో ఫోటోగ్రఫీ మరియు వీడియో మేకింగ్‌పై నిషేధం కూడా ప్రణాళికాబద్ధమైన వ్యూహంలో భాగమే.

కెమెరాలు, స్పై కెమెరాలు, స్మార్ట్‌ఫోన్‌లు క్యాంపస్ భద్రతకు ప్రత్యక్ష ముప్పు అని పేర్కొంది. లోక్‌సభ, రాజ్యసభ సెక్రటేరియట్‌లోని అధికారులు, ఉద్యోగులకు, పార్లమెంట్ హౌస్ ఎస్టేట్‌లో పనిచేస్తున్న ఇతర సహాయక ఏజెన్సీలకు పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్ లోపల ఎలాంటి ఫోటోగ్రఫీ అనుమతి లేదని తెలిపింది.

#### 140 మంది సీఐఎస్ఎఫ్ సిబ్బంది

పార్లమెంట్‌లో బడ్జెట్ సెషన్‌లో సిబ్బంది, వారి లగేజీని పరీక్షించడానికి 140 మంది సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ సిబ్బందిని పార్లమెంట్ కాంప్లెక్స్‌లో మోహరించారు. ఈ విషయాన్ని అధికారిక వర్గాలు వెల్లడించాయి. పార్లమెంట్ భద్రతలో లోపాలను దృష్టిలో ఉంచుకుని గత నెలలో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ భద్రతా ఏర్పాట్లపై సమగ్ర సమీక్ష నిర్వహించింది. అనంతరం సీఐఎస్ఎఫ్ సిబ్బంది బందోబస్తుకు ఆమోదం తెలిపారు. సోమవారం నాడు 140 మంది సీఐఎస్ఎఫ్ సిబ్బంది పార్లమెంట్ భవన సముదాయం భద్రతను చేపట్టారు.సీఐఎస్ఎఫ్ యూనిట్‌కు అసిస్టెంట్ కమాండెంట్ స్థాయి అధికారి నేతృత్వం వహిస్తారని, 36 మంది అగ్నిమాపక సిబ్బందిని కూడా యూనిట్‌లోకి చేర్చుతారని వర్గాలు తెలిపాయి. జనవరి 31న బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కాగానే తమ బాధ్యతను నిర్వర్తించేందుకు సిద్ధంగా ఉండేందుకు వీలుగా ఇప్పటికే అక్కడ ఉన్న ఇతర భద్రతా సంస్థలతో పాటు పార్లమెంట్ సముదాయాన్ని బృందం సమీక్షిస్తోందని ఆయన చెప్పారు.

కొత్త, పాత పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లపై సీఐఎస్ఎఫ్‌కు నియంత్రణ ఉంటుందని, ఇక్కడ విమానాశ్రయం లాంటి భద్రతా వ్యవస్థ ఉంటుంది. ఇక్కడ వ్యక్తులు, వస్తువులను ఎక్స్‌రే యంత్రాలు, మెటల్ డిటెక్టర్‌లతో పరీక్షించడం జరుగుతుంది. బూట్లు, భారీ జాకెట్లు, బెల్ట్‌లను ట్రేలలో నిల్వ చేయడానికి, వాటిని ఎక్స్-రే యంత్రాలతో తనిఖీ చేయడానికి కూడా సదుపాయం ఉంది. పార్లమెంట్ భద్రత కోసం శాశ్వత ప్రాతిపదికన 140 మంది సిబ్బందిని అందుబాటులో ఉంచేందుకు అనుమతి ఇవ్వాలని ఫోర్స్ హోం మంత్రిత్వ శాఖకు లేఖ రాసింది. సిఐఎస్ఎఫ్‌లో దాదాపు 1.70 లక్షల మంది సిబ్బంది ఉన్నారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ పరిధిలోకి వస్తుంది.

